సాక్షి
ఏలూరు

గురువారం । 11 । ఏప్రిల్ । 2024



తనిఖీల్లో నగదు స్వాధీనం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో పలు చోట్ల ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో రూ.2 లక్షల నగదును అధికారులు పట్టివేశారు.

IIలో ▸



వలంటీర్ల రాజీనామాలు

ఉమ్మడి జిల్లాలో వలంటీర్ల రాజీనామాల పర్వం కొనసాగుతోంది. టీడీపీ నేతల తీరుకు నిరసనగా బుధవారం పలు గ్రామాల్లో వలంటీర్లు రాజీనామా చేశారు.

IIలో ▸



బాల్య వివాహాల నిలిపివేత

గత రెండు రోజుల్లో జిల్లాలో 12 బాల్య వివాహాలను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారులు అడ్డుకున్నారు.

IIలో ▸

న్యూస్‌రీల్

రంజాన్ శుభాకాంక్షలు



ఆళ్ల నాని,
ఏలూరు ఎమ్మెల్యే

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా లోని ముస్లింలకు ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్ర రంజాన్ ఉపవాసాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో, నిష్ఠతో కఠినంగా చేస్తారని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ పండుగ అన్నారు. పవిత్రతకు, త్యాగానికి, మత సామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే నాని చెప్పారు.

15న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు (మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రజా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలు ఏలూరులోని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఈనెల 15వ తేదీన నిర్వహిస్తామని జెడ్పీ సీఈఓ కె.సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 1 నుంచి 7 వరకు స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయన్నారు. ఈ సమావేశాల్లో జిల్లాలో అమలు జరుగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్షించడం జరుగుతుందని సుబ్బారావు తెలియజేశారు.

విజయవంతంగా టోఫెల్ పరీక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల్లోని పాఠ్యాంశాల పఠన, ఆకళింపు చేసుకునే సామర్థ్యాలను పరీక్షించడానికి జిల్లా వ్యాప్తంగా గురువారం టోఫెల్ ప్రైమరీ పరీక్ష నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం చెప్పారు. జిల్లాలోని 317 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్ష నిర్వహించామన్నారు. ఉంగుటూరు మండలం గొల్లగూడెం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన పరీక్షను డీఈఓ పర్యవేక్షించారు. ఈ పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు అభ్యసించే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు 52 మందిని ప్రభుత్వం ఎంపిక చేసి అమెరికాలోని ప్రిన్స్‌టన్ యూనివర్శిటీలో ఒక వారం రోజుల శిక్షణకు ప్రభుత్వ ఖర్చులతో పంపుతుందని డీఈఓ పేర్కొన్నారు.

13 నుంచి హెల్త్ వర్శిటీ ఇంటర్ కాలేజ్ మీట్

ఏలూరు రూరల్: ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాలలో ఈ నెల 13వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ 24వ ఇంటర్‌కాలేజ్ మహిళల ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఆశ్రం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వీవీఎస్ఎం శ్రీనివాసరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో యూనివర్శిటీ పరిధిలోని 25 మెడికల్, డెంటల్ కళాశాల జట్లు పాల్గొంటాయన్నారు. వాలీబాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, బాల్‌బాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, త్రోబాల్, చెస్ క్రీడాంశాల్లో మొత్తం 600 మంది క్రీడాకారిణులు పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికరెడ్డి, ఆశ్రం మెడికల్ కళాశాల చైర్మన్ గోకరాజు గంగరాజు, డైరెక్టర్లు జి.రతీదేవి, డాక్టర్ కె.అంజిరెడ్డి, సీఈఓ డాక్టర్ కె.హనుమంతరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ తదితరులు హాజరై పోటీలను ప్రారంభిస్తారని వివరించారు.

ఆర్బీకేల్లో పశువుల మందులు

ఏలూరు (టూటౌన్): జిల్లాలోని అన్ని ఆర్బీకేల్లో ప్రాథమిక పశు వైద్యానికి సంబంధించిన అన్ని మందులు అందుబాటులో ఉంచినట్లు పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 537 ఆర్బీకేలు ఉండగా అందులో పశువుల సంఖ్యను బట్టి 317 ఆర్బీకేలను క్లస్టర్‌గా ఏర్పాటు చేశామన్నారు. వీటిలో పశువైద్య సహాయకులను శాశ్వత ప్రాతిపదికన నియమించడం జరిగిందన్నారు. వీటి ద్వారా 2,900 మెట్రిక్ టన్నుల సమీకృత దాణా, 180 మెట్రిక్ టన్నుల విత్తనాలు, 85 చాఫ్ కట్టర్లు రైతులకు సరఫరా చేశామని ఆయన వివరించారు.

1,757 టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు (మెట్రో): ఏలూరు జిల్లాలో 1,757 మెట్రిక్ టన్నుల రబీ ధాన్యం కొనుగోలు చేశామని జేసీ బి.లావణ్యవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రబీ పంటకు సంబంధించి 120 ఆర్‌బీకేలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు, సిబ్బందిని నియమించామన్నారు. కేంద్రాల్లో ఈనెల 9వ తేదీన 150 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు అందజేయగా, ఈరోజు వరకు 108 మంది రైతులకు సంబంధించి 1,757 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అందులో 44 మందికి చెందిన 302 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అనుసంధానం చేసిన రైస్ మిల్లులకు తరలించామన్నారు. ధాన్యానికి మద్దతు ధర క్వింటాలుకు కామన్ రకం రూ.2,183, గ్రేడ్-ఎ రకానికి రూ.2,203 పొందవచ్చన్నారు.

ఉప్పునీటి ముప్పునకు చెక్

- తీర ప్రాంతాల్లో మూడు రెగ్యులేటర్ల నిర్మాణానికి చర్యలు
- రూ.642.22 కోట్ల విలువైన పనులకు త్వరలో టెండర్లు
- ఈ వేసవిలో పనులు ప్రారంభించేలా ప్రభుత్వం కసరత్తు
- తీరనున్న సాగు, తాగునీటి కాలుష్య సమస్య



మొగల్తూరు మండలం మోళ్లపర్రు సీమౌత్ వద్ద రెగ్యులేటర్ నిర్మించనున్న ప్రాంతం

నరసాపురం: పశ్చిమగోదావరి జిల్లాలోని తీర ప్రాంతం, ఏలూరు జిల్లాలోని కొల్లేరు ప్రాంతంలో నీటి కాలుష్యాన్ని నివారించేందుకు, ఉప్పు నీటి ముప్పు నుంచి రైతులను, ప్రజలను రక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా రూ.642.22 కోట్ల వ్యయంతో పశ్చిమగోదావరి జిల్లాలో రెండుచోట్ల, ఏలూరు జిల్లాలో ఒకచోట మొత్తం మూడు రెగ్యులేటర్లు, రెండు వంతెనలు నిర్మించనుంది. ఈ మేరకు ఇరిగేషన్ శాఖ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. క్యాబినెట్ కూడా గత ఏడాదే ఆమోద ముద్ర వేసింది. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నరసాపురంలో శంకుస్థాపన చేశారు. ఈ పనులకు సంబంధించి ప్రాథమిక సర్వే కూడా పూర్తయ్యింది. మరికొద్ది రోజుల్లో టెండర్లు పిలిచి ఈ వేసవిలో పనులు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు.

ఉప్పునీటి తిప్పలు తప్పేలా..

పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో విస్తరించిన కొల్లేరు సరస్సులో సుమారు 67 వరకు చిన్న, మధ్య, పెద్ద డ్రెయిన్లు కలుస్తున్నాయి. కొల్లేరు సరస్సు నుంచి ఈ నీరంతా ప్రవహిస్తూ ఆకివీడు మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోని దుంపగడప వద్ద ఉప్పుటేరులో కలుస్తుంది. అక్కడి నుంచి నీరు సుమారు 64 కిలోమీటర్ల మేర ప్రవహించి మొగల్తూరుకు సరిహద్దుగా ఉన్న కృష్ణా జిల్లా చినగొల్లపాలెం వద్ద సముద్రంలో కలుస్తోంది. అలాగే జిల్లాలోని పలు ఉప్పుటేరుల్లోని నీరు కూడా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ మోళ్లపర్రు సీమౌత్ వద్ద సముద్రంలో కలుస్తోంది. సముద్రంలో కలవడం ద్వారా ఈ నీరంతా ఉప్పునీరుగా మారుతుంది. సముద్రం ఆటు, పోట్ల వల్ల మళ్లీ సీమౌత్ ద్వారా తిరిగి డ్రెయిన్లలోకి ఈ నీరు ఎదురు ప్రవహిస్తోంది. దీంతో ఒకప్పుడు చప్పనీరుగా ఉండే కొల్లేరు సరస్సులోని చాలాభాగం ఇప్పుడు ఉప్పునీరుగా మారింది. ఉప్పునీరు డ్రెయిన్లలో కలవడం ద్వారా సాగు, తాగునీటికి ఉపయోగపడం లేదు.

48 గ్రామాల తాగునీటి సమస్యకు పరిష్కారం

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఈ సమస్యను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన సీఎం జగన్ వాటర్ రీసోర్సెస్ ప్రాజెక్టు కమిటీ నిపుణల సలహా కోరుతూ ఉత్తర్వులిచ్చారు. కమిటీ నిపుణులు మూడుచోట్ల రెగ్యులేటర్ల నిర్మాణం చేపట్టి, నీటిని అదుపు చేస్తే సమస్య పరిష్కారమవుతుందని సూచించడంతో ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఈ రెగ్యులేటర్ల నిర్మాణం ద్వారా సుమారు 2వేల ఎకరాల ఆయకట్టు రైతులకు ఉప్పునీటి ఇబ్బందులు తొలగనున్నాయి. అలాగే 48 గ్రామాలకు తాగునీటి కాలుష్య సమస్య తీరనుంది.

రెగ్యులేటర్లు నిర్మించే ప్రాంతాలు ఇవే..

- రూ.111 కోట్లతో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం దుంపగడపలో..
- రూ.364.87 కోట్లతో మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ పంచాయతీ మోళ్లపర్రు (సముద్రం-ఉప్పుటేరు కలిసే సీమౌత్) వద్ద రెగ్యులేటర్ కమ్ వంతెన
- రూ.166.35 కోట్లతో ఏలూరు జిల్లా పడతడిక వద్ద రెగ్యులేటర్ కమ్ వంతెన నిర్మాణం

దీర్ఘకాల సమస్యకు మోక్షం



రెగ్యులేటర్ల నిర్మాణంతో దీర్ఘకాల సమస్యకు పరిష్కారం లభించనుంది. వేలాది ఎకరాల రైతులకు సాగునీటి సమస్యలతో పాటు 48 గ్రామాల ప్రజలకు ఉప్పునీటి సమస్య తీరుతుంది. ఆక్వా రైతులకు కూడా మేలు జరుగుతుంది. గత టీడీపీ ప్రభుత్వం ఇలాంటి దీర్ఘకాల ప్రయోజనాలు ఉన్న ప్రాజెక్టులపై దృష్టి పెట్టలేదు. త్వరలో పనులు మొదలుపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాం.
– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

నీటి చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



కలిదిండిలో కాలువలో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

కైకలూరు/కలిదిండి: తాగునీటి అవసరాల కోసం కృష్ణా బ్యారేజ్ నుంచి విడుదల చేసిన నీటిని కేవలం గ్రామాల్లో తాగునీటి చెరువులను మాత్రమే నింపుకోవాలని ఇతర అవసరాల కోసం నీటి చౌర్యానికి పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ హెచ్చరించారు. కలిదిండిలో చెరువులకు నీటిని నింపుతున్న విధానాన్ని, రెండు రోజుల్లో నీరు అందనున్న పోల్‌రాజ్ కాల్వను కలెక్టర్ పరిశీలించారు. కైకలూరు నియోజవర్గంలో 158 చెరువుల్లో నీరు నింపే పనులను అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. కాలువల ద్వారా నీటి సరఫరాను డ్రోన్ల ద్వారా పరిశీలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్యాంప్ బెల్ కాల్వ ద్వారా 39 చెరువులకు నీటిని నింపుతున్నారన్నారు. మళ్లీ రెండు నెలల వరకు కాలువలకు నీటి విడుదల జరగదన్నారు. జిల్లాలో మంచినీటి కొరత, తాగునీటి ఎద్దడి ఉంటే 91001 21271 ఫోన్ నంబర్‌కు తెలియచేయాలని, ప్రతిరోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సంబంధిత సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎన్.సత్యనారాయణ, ఏలూరు ఆర్డీఓ ఎన్ఎస్‌కే ఖాజావలి పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించండి



అన్నవరం ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని నూజివీడు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. మండలంలోని అన్నవరం, హనుమంతులగూడెంలలో బుధవారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీలకతీతంగా సంక్షేమం, అభివృద్ధి చేయడంలో జగనన్నకు ఎవరూ సాటిరాలేరన్నారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చూసి ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. అధికార దాహంతో కూటమిగా ఏర్పడిన ప్రతిపక్షాలకు ప్రజలే తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. వైఎస్ జగన్ చేస్తున్న ఎన్నికల ప్రచారానికి వస్తున్న జనాన్ని చూసి కూటమి నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. జగనన్న పాలనలోనే అన్ని వర్గాల ప్రజల సంక్షేమం సాకారమైందన్నారు. ఎన్నికల సమయంలో బూటకపు హామీలతో మోసపూరిత వాగ్దానాలతో పగటి వేషగాళ్లు వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. చంద్రబాబు పసుపు-కుంకం పథకం పేరుతో మహిళలను మోసం చేయాలని చూశాడని, వైఎస్ జగన్ మాత్రం మహిళల రుణాలను మాఫీ చేయడంతో పాటు వారికి ఆసరా, చేయూత వంటి పథకాలను అమలుచేశారన్నారు. జగనన్నను అత్యధిక మెజారిటీతో గెలిపించి రెండోసారి సీఎంను చేసుకోవాలన్నారు. ఎంపీపీ ఆరేపల్లి శిరీష, సర్పంచి మొలుగుమాటి శ్రీలక్ష్మి, జడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, వైఎస్సార్‌సీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడు శీలం రాము, నాయకులు ఆరేపల్లి రాంబాబు, మారేష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నీచ రాజకీయాలను తిప్పికొట్టండి

ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని



ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఇంజనీర్ బొమ్మి శేషబాబు

ఏలూరు టౌన్: ఏలూరులో టీడీపీ దివాళాకోరు రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రజలకు ఏమి చేస్తామో చెప్పుకోలేని స్థితిలో పార్టీ అధిష్టానం ఉందని, వారి నీచ రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టే రోజులు త్వరలోనే ఉన్నాయని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో సివిల్ ఇంజనీర్ బొమ్మి శేషబాబు గురువారం ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఇటీవల 43వ డివిజన్‌లో తన సోదరుడు భవన నిర్మాణాన్ని చూసేందుకు వెళ్లగా బలవంతంగా తన మెడలో టీడీపీ కండువా కప్పి సోషల్ మీడియా ద్వారా అసత్యప్రచారం చేస్తున్నారని శేషబాబు ఆవేదన వ్యక్తం చేశారు. తాను వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా ఉన్నానని తెలిపారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని విజయానికి తన శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ టీడీపీ కుట్రపూరిత రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించటం ఖాయమని చెప్పారు. మోసపూరిత టీడీపీ వాగ్దానాలను ప్రజలు విశ్వసించటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఘంటా ప్రసాదరావు, ఇడా చైర్మన్, ఏలూరు నగర అధ్యక్షులు బొద్దాని శ్రీనివాస్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, ఎస్‌కే రిజ్వాన్ తదితరులు ఉన్నారు.

నిత్యం చేరికలతో వైఎస్సార్ సీపీలో జోష్



గోపన్నపాలెం యువకులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైఎస్సార్ సీపీలో నిత్యం చేరికలతో నూతన ఉత్సాహంతో పార్టీ శ్రేణులు హుషారుగా ఉన్నారు. బుధవారం కొండలరావుపాలెంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో దెందులూరు మండలం సోమవరప్పాడు, గోపన్నపాలెం గ్రామాల నుంచి సుమారు 30 కుటుంబాలకు చెందిన వారు జనసేనను వీడి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి వారికి కండువాలు కప్పి వారిని సాదరంగా వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీలో చేరిన నేతలు, యువకులు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీదే విజయం అంటూ అబ్బయ్యచౌదరికి జేజేలు పలికారు. ఈ కార్యక్రమంలో దెందులూరు జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం, నాయకులు కామిరెడ్డి నాని, వేమూరి జితేంద్ర, గోపన్నపాలెం సర్పంచ్ కె.నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

చంద్రబాబువి మోసపూరిత వాగ్దానాలు



శెట్టివారిగూడెంలో ఎన్నికల ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కారుమూరి సునీల్, కె.విజయరాజు

చింతలపూడి: చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు చెప్పే వాగ్దానాలను నమ్మి మోసపోవద్దని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ ప్రజలను కోరారు. మండలంలోని శెట్టివారిగూడెం, నామవరం, సుబ్బారాయుడుగూడెం గ్రామాల్లో బుధవారం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలను నేరుగా కలుసుకుని రాష్ట్రంలో ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనను వివరించారు. వైఎస్ జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. పేద ప్రజల కోసం సీఎం వైఎస్ జగన్ నవరత్న పథకాలను ప్రవేశపెట్టి రూ.2.70 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. గత టీడీపీ పాలనను, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య ఉన్న తేడాను గమనించి ఓటు వేయాలని కోరారు. చింతలపూడి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కంభం విజయరాజు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించి ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. జగనన్న గతంలో ఏ ప్రభుత్వం చేయనటువంటి సంక్షేమ పాలనను ఇంటివద్దకే తీసుకువచ్చారన్నారు. 2014లో టీడీపీ, జనసేన, బీజేపీలు కలిసి 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. త్వరలోనే జగనన్న మేనిఫెస్టోను విడుదల చేస్తారని తెలిపారు. ప్రజలు అమూల్యమైన ఓటును ఫ్యాన్ గుర్తుపై వేసి ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

● రంజాన్ కాంతులు



అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు పూర్తి చేసిన ముస్లింలు రంజాన్ పర్వదినాన్ని జరుపుకునేందుకు సన్నద్ధమయ్యారు. ప్రార్థనా మందిరాలు, మసీదులను విద్యుద్దీపాలు, రంగులతో అలంకరించారు. గురువారం రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు చేశారు. ఏలూరులో కాంతులీనుతున్న గన్‌బజార్ మసీదు దృశ్యమిది.
- ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)

కొలువుల కల తీరి ఏడాది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 'మాకు ఉద్యోగాలు వచ్చి అప్పుడే ఏడాది గడిచింది. ఇది నమ్మశక్యంగా లేదు.. మాకు ఉద్యోగాలు వస్తాయనే ఆశ వదులుకున్న తరుణంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మమ్మల్ని గుర్తించి ఉద్యోగాలిచ్చి మా కుటుంబాలను ఆదుకోవడం కలలా అనిపిస్తోంది. ఉద్యోగాలు వచ్చి అప్పుడే ఏడాది పూర్తి చేసుకున్నామంటే ముఖ్యమంత్రి చలవే' అంటూ 1998 డీఎస్సీ అర్హులైన టీచర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోట ఎడ్వర్డ్ విలేకరులతో మాట్లాడుతూ 1998వ సంవత్సరంలో డీఎస్సీ రాసి అర్హత సాధించిన తమను గత ప్రభుత్వాలు దారుణంగా మోసం చేశాయన్నారు. తమను సీఎం వైఎస్ జగన్ గుర్తించి మినిమమ్ టైమ్ స్కేల్ ప్రాతిపదికన ఉపాధ్యాయ ఉద్యోగాలిచ్చి తమ కుటుంబాలను ఆదుకున్నారన్నారు. ఈ నెల 12వ తేదీతో తాము కొలువుల్లో చేరి ఏడాది పూర్తి అవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలో 274 మందికి ఉపాధ్యాయ కొలువుల కల నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



జస్టిస్ వెంకట రమణకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ డీఈఓ బాబురావు



జస్టిస్ గోపాలకృష్ణారావుకు స్వామివారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు బుధవారం సందర్శించారు. ముందుగా కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన జస్టిస్ దుప్పల వెంకటరమణ, జస్టిస్ వి.గోపాలకృష్ణారావులకు ఆలయ అధికారులు, అర్చకులు తూర్పురాజగోపురం వద్ద పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు న్యాయమూర్తులకు శ్రీవారి శేషవస్త్రాలను కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ డీఈఓ బాబురావు స్వామివారి జ్ఞాపికలను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓలు మెట్టపల్లి దుర్గారావు, పి.నటరాజారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేధింపులు భరించలేక రాజీనామాలు

- పలుచోట్ల మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్న వలంటీర్లు
- టీడీపీ, జనసేన తమపై కక్ష కట్టి వేధిస్తున్నాయని ఆవేదన


ముసునూరులో ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు సమర్పిస్తున్న గోపవరం గ్రామ వలంటీర్లు


నూజివీడు కమిషనర్ వెంకటరామిరెడ్డికి రాజీనామా లేఖలను అందజేస్తున్న ఒకటి, మూడు వార్డుల్లోని వలంటీర్లు

ముసునూరు: టీడీపీ, జనసేన నేతల వేధింపులు భరించలేక మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు గోపవరం గ్రామ వలంటీర్లు ప్రకటించారు. గోపవరం గ్రామానికి చెందిన 29 మంది వలంటీర్లు బుధవారం మధ్యాహ్నం ఎంపీడీఓ సీహెచ్ పద్మావతీదేవికి రాజీనామా పత్రాలు అందజేశారు. అనంతరం స్థానిక విలేకర్ల ఎదుట తమ గోడు వినిపించారు. ఎన్నికల షెడ్యూలు వచ్చి వలంటీర్లు డ్యూటీలను వదలి పెట్టాలన్న మరుక్షణమే తాము ప్రభుత్వ ఫోన్లు వెనక్కి ఇచ్చేసి, విధులకు పూర్తిగా దూరంగా ఉన్నామని, కానీ గ్రామంలోని టీడీపీ, జనసేన కార్యకర్తలు సూటిపోటి మాటలతో వేధింపులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కింటి వారితో, తెలిసిన వారితో మాట్లాడినా ఎన్నికల ప్రచారం చేస్తున్నారా అంటూ ఫోటోలు తీసే ప్రయత్నాలు చేయడం వంటి చర్యలకు దిగుతూ వేధిస్తున్నారని వాపోయారు. మా ఇళ్లలోనూ, బైక్‌లకు అధికార పార్టీ జెండాలు, బ్యానర్లు, స్టిక్కర్ల వంటి ప్రచార సాధనాలున్నాయా అనే కోణంలో ఎంక్వయిరీలు చేయిస్తున్నారని, గత్యంతరం లేని పరిస్థితుల్లో తాము 29 మంది మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. అనంతరం వారు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నాగవల్లేశ్వరరావు, వైస్ ఎంపీపీ పాముల గంగాధర్‌తో కలిసి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును కలసి, తమ ఇబ్బందులను తెలియజేసి, రాజీనామాలు చేసినట్లు ఆయనకు వివరించారు.

నూజివీడులో 14 మంది..

నూజివీడు : పట్టణంలోని ఎమ్మార్ అప్పారావుకాలనీ, మూడో వార్డుకు చెందిన 14 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు వారు బుధవారం మున్సిపల్ కమిషనర్ రొద్దం వెంకట రామిరెడ్డికి రాజీనామా లేఖలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంట్లో నుంచి బయటకు వచ్చి ఎవరితోనైనా మట్లాడితే చాలు ఎన్నికల ప్రచారం చేస్తున్నారంటూ దుష్ప్రచారం చేస్తూ వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

భీమడోలు మండలంలో 23 మంది..

భీమడోలు : పోలసానిపల్లిలో 11 మంది, భీమడోలులో 12 మంది వలంటీర్లు బుధవారం మూకుమ్మడి రాజీనామాలు చేశారు. రాజీనామా పత్రాలను గ్రామ పంచాయతీ కార్యనిర్వాహక కార్యదర్శులు జయరామకృష్ణ, ఎస్.ఠాగూర్‌లకు అందజేశారు. ప్రజలు మెచ్చిన వలంటీర్ల వ్యవస్థపై చంద్రబాబు కూటమి విషం కక్కుతూ దుష్ప్రచారం చేయడం చాలా బాధకరమన్నారు.

మండవల్లిలో 12 మంది..

మండవల్లి : మండవల్లిలో 12 మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. కరోనా సమయంలో ఎంతో నిస్వార్థంగా సేవలందించిన తమపై ఎలక్షన్ కోడ్ వచ్చిన తర్వాత ప్రతిపక్షాలు వ్యవహరిస్తున్న తీరుకి మనస్తాపానికి గురై వలంటరీ సేవలకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీరామపురంలో 10 మంది..

దెందులూరు: శ్రీరామవరం గ్రామానికి చెందిన పది మంది వలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. ఈమేరకు ఎంపీడీవోకు రాజీనామా పత్రాలను అందజేశారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి పనిచేసిన తమను ఎన్నికల నిబంధనల పేరుతో విధులకు దూరంగా పెట్టడం దారుణమన్నారు.

పి.కన్నాపురంలో 17 మంది..

ద్వారకాతిరుమల : ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ సేవ చేస్తున్న తమపై టీడీపీ కక్షగట్టి ప్రజా సేవకు దూరం చేయడాన్ని నిరసిస్తూ మండలంలోని పి.కన్నాపురం సచివాలయ వలంటీర్లు 17 మంది బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి సప్తగిరికి తమ రాజీనామా పత్రాలను అందజేశారు. గ్రామాల్లో ఇరుగు పొరుగువారితో మాట్లాడిన టీడీపీ నేతలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు.

ఆకివీడులో 9 మంది..

ఆకివీడు : స్థానిక సచివాలయం-2 పరిధిలో 9 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఈ మేరకు రాజీనామా పత్రాల్ని బుధవారం ఎంపీడీఓ రామకృష్ణకు అందజేశారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేస్తున్న ఆరోపణలతో మనస్తాపానికి చెందిన తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

ముఖధారమ్మ సన్నిధిలో...


ముఖధారమ్మను దర్శించుకున్న సినీ నటుడు తనికెళ్ల భరణి

పాలకొల్లు సెంట్రల్ : స్థానిక అచ్చుగట్లపాలెంలో కొలువై ఉన్న శ్రీ ముఖధారమ్మవారిని బుధవారం సినీ రచయిత, నటుడు తనికెళ్ల భరణి దర్శించుకున్నారు. తొలుత ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ ట్రస్ట్‌బోర్డు సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం చేశారు. రావులపాలెంలో కళాపరిషత్ పోటీలకు వచ్చానని ఇక్కడ అమ్మవారి జాతర మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియపరచడంతో ముఖధారమ్మను దర్శించుకోవడానికి వచ్చినట్లు తనికెళ్ల భరణి చెప్పారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కుంపట్ల చిన్నరాజా, సభ్యులు ఉన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ


రోప్ స్కిప్పింగ్‌లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: ఆల్‌ఇండియా అంతర్ యూనివర్సిటీల రోప్ స్కిప్పింగ్ ఛాంపియన్ షిప్‌లో భీమవరం డీఎన్నార్ కళాశాల విద్యార్థులు మూడు బంగారు, రెండు రజిత పతకాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ బీఎస్ శాంతకుమారి చెప్పారు. బుధవారం పతకాలు సాధించిన విద్యార్థులకు కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు అభినందనలు తెలిపారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్, నన్నయ్య వర్సిటీ రోప్ స్కిప్పింగ్ టీం కోచ్ బీవీ నర్సింహరాజు మాట్లాడుతూ ఈ పోటీల్లో దేశం నలుమూలల నుంచి 37 యూనివర్సిటీల విద్యార్థులు పాల్గొనగా నన్నయ్య వర్సిటీకీ మూడు బంగారు, రెండు రజిత పతకాలు పురుషులకు, ఒక రజిత పతకం మహిళలు సాధించగా పురుషుల విభాగంలో టీం ఛాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని వివరించారు. కళాశాల ఏఓ పి.రామకృష్ణంరాజు, ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎమ్ స్కూల్ పీఈటీ జీపీసీ శేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష కూటమికి చావుదెబ్బ ఖాయం

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని


వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ళనాని

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిపక్ష కూటమికి చావుదెబ్బ ఖాయమని, ప్రజలంతా చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని అన్నారు. ఏలూరు వన్‌టౌన్‌లోని 17వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన 100 మందికి పైగా కార్యకర్తలు వైఎస్సార్ సీపీ నాయకుడు పాము శామ్యూల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే ఆళ్ళ నాని వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆళ్ళ నాని మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయభేరి మోగించి మరోసారి అధికారం చేపట్టేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మాత్రమేనని, చంద్రబాబు కూటమి పట్ల ప్రజలకు నమ్మకం లేదన్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబుకు కనీసం తాను అత్యంత సమర్థవంతంగా చేపట్టిన ఒక్క పథకాన్ని చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో సైతం తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తామో చెప్పే ధైర్యం లేక, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అసత్య ప్రచారాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఏలూరుతోపాటు, జిల్లాలోని అన్ని స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ గెలిచి తీరుతుందని ఎమ్మెల్యే నాని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, సీనియర్ నాయకులు పట్టగర్ల రామ్మోహనరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రూ.1.30 లక్షల స్వాధీనం

చింతలపూడి : చింతలపూడి మండలం అల్లిపల్లి చెక్ పోస్ట్ వద్ద బుధవారం అధికారుల తనిఖీల్లో రూ.1.30 లక్షలను ఎస్ఎస్‌టీ టీమ్ స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ సొమ్ముకు సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో జిల్లా ట్రెజరీలో నగదు డిపాజిట్ చేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి పీవీవీ గోపాలకృష్ణ తెలిపారు.

కె.కోటలో రూ.77,900 స్వాధీనం

కామవరపుకోట : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కామవరపుకోట ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద నిర్వహిస్తున్న వాహన తనిఖీల్లో రూ.77,900 నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్ట్ ఎన్నికల అధికారి కె.శేషగిరి రావు తెలిపారు. విజయవాడ నుంచి జంగారెడ్డి గూడెం వైపు వెళ్తున్న కారు తనిఖీ చేయగా, ఆ కారులో ప్రయాణిస్తున్న ఒక మహిళ వద్ద నుంచి ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఏలూరు ట్రెజరీ కార్యాలయంలో ఫ్లయింగ్ స్క్వాడ్ నగదు జమ చేస్తారని, తగిన ఆధారాలు చూపిస్తే నగదును సంబంధిత వారికి ఇవ్వటం జరుగుతుందని శేషగిరి రావు పేర్కొన్నారు. వాహన తనిఖీల్లో పోలీసు సిబ్బంది ఎ.అశోక్, ఎ.సుధీర్, ఎం.నాగార్జున పాల్గొన్నారు.


అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహించి నగదును స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో 27న పుణ్యక్షేత్ర యాత్ర

ఏలూరు (టూటౌన్): భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఐఆర్‌సీటీసీ పుణ్యక్షేత్ర యాత్ర పేరుతో భారత్ గౌరవ్ టూరిస్టు రైలును నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా ఒక ప్రకటనలో తెలియజేశారు. పుణ్యక్షేత్ర యాత్రలో భాగంగా పూరి, కోణార్క్, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ పుణ్యక్షేత్రాలను సందర్శించే అవకాశం ఉందన్నారు. ఈ యాత్ర రైలు ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట మీదుగా వెళుతుందన్నారు. తిరిగి యాత్ర ముగించుకుని వచ్చే నెల 6వ తేదీ ఉదయం 10 గంటలకు ఈ రైలు సికింద్రాబాద్ చేరుకుంటుందన్నారు. ఇందుకు స్లీపర్ క్లాస్ టిక్కెట్ ధర రూ.16,525, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర రూ.25,980, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర రూ.33,955గా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎల్టీసీ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చునని చెప్పారు. పూర్తి వివరాలు, టిక్కెట్ల కొరకు తమ వెబ్‌సైట్‌ను గాని, ఐఆర్‌సీటీసీ విజయవాడ కార్యాలయం నందు గాని సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఐఆర్‌సీటీసీకి చెందిన ప్రవీణ్ 92814 95848, రాజేష్ 89773 14121 నంబర్లలో సంప్రదించాలని ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలియజేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలే లక్ష్యం

జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి


మణుగునూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

కైకలూరు : సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణలో పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి చెప్పారు. మండవల్లి మండలం మణుగులూరులో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని, ఎన్నికల సామగ్రిని పంపిణీ చేసే కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌ను బుధవారం పరిశీలించారు. అనంతరం కైకలూరు సర్కిల్ కార్యాలయంలో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు, సీఐలు బి.కృష్ణకుమార్, ఆకుల రఘు, నియోజకవర్గంలోని వివిధ స్టేషన్ల ఎస్సైలు టి.రామకృష్ణ, రాజు, వెంకట్‌కుమార్, ప్రియకుమార్, శ్రీరామచంద్రమూర్తిలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పోలీసు సిబ్బంది ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటించేలా ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతర నిఘాను పటిష్టపర్చాలన్నారు. పూర్వపు ఎన్నికల పోలింగ్ సమయంలో ఘర్షణలు జరిగిన పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని సమీక్షించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.భాస్కరరావు, ఎలక్షన్ డీఈ కిరణ్, ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, వ్యవసాయ మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

సాగునీటి విడుదలపై రైతుల హర్షం


పాలగూడెంలో చేలకు నీరు చేరడంపై రైతుతో మాట్లాడుతున్న అధికారులు

ఏలూరు రూరల్: అధికారులు సకాలంలో స్పందించి సాగునీరు విడుదల చేయడంపై పాలగూడెం రైతులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబిబ్‌భాషా, ఏడీఏ వై సుబ్బారావు పాలగూడెంలో పంటచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అధికారులతో మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి నీరు అందకపోవడంతో భయపడ్డామన్నారు. ఏం చేయాలో తోచక జిల్లా కలెక్టర్ వె ప్రసన్నవెంకటేష్‌కు మొరపెట్టుకున్నామన్నారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవడం వల్ల నేడు పంటచేలకు నీరు పారుతోందని సంతోషం వ్యక్తం చేశారు. కష్టకాలంలో వ్యవసాయశాఖ అధికారులు ఆదుకున్నారని కొనియాడారు. దీనిపై స్పందించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబిబ్‌భాషా మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యపై కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి సాగునీరు విడుదలకు కృషి చేశారని రైతులకు వివరించారు. ఇకపై రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావదన్నారు. పంట చేతికి వచ్చే వరకూ వ్యవసాయశాఖ అధికారులు అన్ని విధాల సహాయ, సహకారం అందిస్తారన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి జీవనసంధ్యతో పాటు పలువురు పాలగూడెం రైతులు ఉన్నారు.

శిలాఫలకం ధ్వంసం హేయం


టీడీపీ వర్గీయులు ధ్వంసం చేసిన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెదవేగి : ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న బలివే బ్రిడ్జి శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం టీడీపీ నేతల హేయమైన చర్యకు నిదర్శనమని దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిచే శంకుస్థాపన జరిగి, రూ.18 కోట్ల నిధులతో వేగంగా బలివే బ్రిడ్జి పనులు జరుగుతున్న వేళ, అక్కడి శిలాఫలకాన్ని బుధవారం టీడీపీ వర్గీయులు ధ్వంసం చేయించడం క్షమించరాని నేరమని ఎమ్మెల్యే అన్నారు. పెదవేగి మండలం విజయరాయి శివారు కృష్ణా, ఏలూరు జిల్లాల మధ్య ప్రజల రాకపోకలకు సంబంధించిన దశాబ్దాల సమస్య పరిష్కారం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బలివే బ్రిడ్జి ద్వారా శాశ్వత పరిష్కారం అందిస్తున్నామని, మేము చేసిన మంచి పనులకు ప్రజల నుంచి వస్తున్న మంచి స్పందనను చూసి చింతమనేని ఓర్వలేక, ఇలాంటి నీచమైన పనులు చేయిస్తున్నాడని అబ్బయ్యచౌదరి దుయ్యబట్టారు. రాజకీయాల్లో విధ్వంసాలకు చోటు లేదని, ఇలాంటివి చేస్తే ప్రజలు హర్షించరన్నారు. రాజకీయాలను హుందాగా చేయాలి చింతమనేని అంటూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి వార్నింగ్ ఇచారు. ఆయన వెంట స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

రెండు రోజుల్లో 12 బాల్య వివాహాలు నిలుపుదల


బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలూరు (టూటౌన్) : గత రెండు రోజుల్లోనే జిల్లా వ్యాప్తంగా 12 బాల్య వివాహాలను నిలుపుదల చేసినట్లు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, మహిళా సాధికారత అధికారి కేవీఎల్ పద్మావతి, డీసీపీఓ డాక్టర్ సీహెచ్ సూర్యచక్రవేణి తెలిపారు. స్థానిక డీసీపీఓ కార్యాలయంలో బుధవారం బాలికల తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బాల్య వివాహాల నిర్మూలనకు తల్లిదండ్రుల్లో చైతన్యం రావాలన్నారు. ఆడపిల్లలంటే భయపడకుండా వారిని బాగా చదివించి ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రోత్సహించాలన్నారు. బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, బాలికలు కూడా మానసిక పరిణతి పూర్తిగా వచ్చేవరకు ప్రేమ పేరుతో ముందుకు వెళ్లవద్దన్నారు. బాల్య వివాహాలు చేస్తున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే 1098కు లేదా సెల్ నెంబర్ 94910 63810 కి సమాచారం అందించాలని కోరారు.

గేట్‌లో జాతీయ ర్యాంకు


విద్యార్థి నిహార్ రత్నకొండను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి బి నిహార్ రత్నకొండ జాతీయ స్థాయిలో నిర్వహించిన గేట్‌లో ఈసీఈ విభాగంలో 20వ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో అతడిని సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ నిహార్ రత్నకొండ 2021లో ఈసీఈ ఉత్తీర్ణత సాధించి పోస్ట్ గ్రాడ్యుయేట్ మంచి విద్యాసంస్థలో చేరాలనే లక్ష్యంతో కృషిచేసి ఈ ర్యాంక్ సాధించాడన్నారు. దీనితో జాతీయ స్థాయిలోనే ప్రతిష్టాకరమైన ఐఐటీ, ఐఐఎస్‌సీ వంటి విద్యాసంస్థల్లో చేరేందుకు అవకాశం లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఈసీఈ హెడ్ ఎస్ ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

50 మద్యం సీసాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో కైకలూరు సెబ్ సీఐ సుధా, సిబ్బంది

కైకలూరు: అక్రమ మద్యం కలిగి ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) కై కలూరు సీఐ డి.సుధా చెప్పారు. తనిఖీలలో భాగంగా కైకలూరులో దాసరి లాజరు అనే వ్యక్తి నుంచి 50 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో కే.హేమంద్ర, సెబ్ ఎస్‌ఐ రాజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యాభర్తల అదృశ్యంపై కేసు నమోదు

యలమంచిలి: భార్య, భర్తల అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కాకి శివ నారాయణ తెలిపారు. చించినాడ వంతెన వద్ద ఉన్న పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా అటుగా బైక్ మీద వచ్చిన వ్యక్తి వంతెన రెయిలింగ్ మీద బ్యాగు, చెప్పులు ఉన్నాయని చెప్పడంతో పోలీసులు అక్కడకు వెళ్లి వాటిని పరిశీలించారు. ఇంతలో భీమవరం నుంచి ఒక వ్యక్తి తన సోదరుడు, అతని భార్య, కూతురు కనిపించడంలేదని ఎస్సై శివ నారాయణకు ఫోన్ చేయడంతో అతనికి బ్యాగు విషయం వివరించారు. అతను వచ్చి బ్యాగు, చెప్పులు తన సోదరుడివేనని గుర్తుపట్టారు. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.